







కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి గురువారం టీవీ9లో ప్రసారమైన వార్తలు

# కుమ్మక్కు కుట్ర

మొదటిపేజీ తరువాయి...

ఇంజినీర్లు మేడిగడ్డ దగ్గర గ్రౌటింగ్ పనులు చేసి సాక్ష్యాలను చెరిపివేశారంటూ ఎన్‌డీఎస్‌ఏ అలక బూనుతుంది. మేమేమీ చేయలేమని చేతులెత్తేస్తుంది. ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏ నివేదిక వచ్చే వరకూ మేడిగడ్డను పునరుద్ధరించబోమంటూ భీష్మించుకు కూర్చుంటుంది.



### హస్తిన నుంచి ఊడిపడిన నివేదిక

అసలు తాము తుది నివేదిక ఇచ్చే పరిస్థితి లేకుండా చేశారంటూ ఇన్నాళ్లూ తెలంగాణ ఇంజినీర్లపై ఆరోపణలు చేసిన ఎన్‌డీఎస్‌ఏ.. ఏదో కల పడినట్టు.. ఉపద్రవమేదో ముంచుకొచ్చినట్టు.. రాత్రికి రాత్రి కాళేశ్వరం బరాజ్‌లపై నివేదిక ఇచ్చింది. అదీ సరిగ్గా... బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు రెండు రోజుల ముందు! సభ చారిత్రాత్మకంగా జరగనున్నదనే స్పష్టమైన సంకేతాలు, ప్రజల్లో అనూహ్య స్పందన వస్తున్న ఇలాంటి తరుణంలో ఈ ఉలికిపాటు దేనికి సంకేతం?! ఏడాదిన్నరలో కాంగ్రెస్ సర్కారు వరుస వైఫల్యాలు... రైతులు సహా అన్నివర్గాల్లో పెల్లుబికుతున్న అసంతృప్త జ్వాలలు... ఏ గ్రామానికి పోయినా కేసీఆర్ సారే మళ్లీ రావాలంటూ తెలంగాణ ప్రజలు వ్యక్తంచేస్తున్న అభిప్రాయాలు.. ఇంకేముంది? కాంగ్రెస్‌కు కేసీఆర్ భయం పట్టుకున్నది. ఏడాదిన్నరగా కాంగ్రెస్ ప్రభుత్వానికి కష్టమొచ్చిన ప్రతిసారీ పరోక్షంగా ఆదుకుంటున్న హస్తినలోని బీజేపీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అందుకే ఉన్నఫలంగా ఎన్‌డీఎస్‌ఏ నివేదిక రూపంలో కాంగ్రెస్ పార్టీకి దన్నుగా నిలిచేలా డైవర్షన్ రాజకీయానికి తెర లేపింది. ఎలాగూ మరో నెలన్నరలో వర్షాలే మొదలవుతాయి. అంటే, మరమ్మతు పనులకు మరో ఏడాది ఆగాల్సిందే. మరి ఇన్నాళ్లూ మీనమేషాలు లెక్కించిన ఎన్‌డీఎస్‌ఏ.. ఈ సమయంలో నివేదికను ఇవ్వడమంటేనే 'దాల్ మే కుచ్ కాలాహై!' అనేది అక్షర సత్యం.

### నాడు వారం రోజుల్లోనే రిపోర్టు

నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 ప్రకారం.. దేశంలో ఎక్కడ ఎలాంటి డ్యామ్‌లు, ప్రాజెక్టులకు ప్రమాదం వాటిల్లినా.. వాటిపై వెంటనే తనకు తానుగా స్పందించి, వాటిని సందర్శించి, వివరాలు తెలుసుకుని, నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి సిఫారసులు చేయాల్సిన అధికారం, బాధ్యత నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ)కి ఉన్నది. అందుకు అనుగుణంగానే 2023 అక్టోబర్ 21న మేడగడ్డ బరాజ్‌లోని పిల్లర్ కుంగుబాటునకు గురైన వెంటనే ఆ చట్టాన్ని ఆసరా చేసుకుని ఎన్‌డీఎస్‌ఏ.. ఆగమేఘాల మీద ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్‌జైన్‌తో పాటు కే శర్మ, ఆర్ తంగమాణి, రాహుల్ కే సింగ్, దేవేందర్‌రావు, కేజీబీవో నామినేట్ చేసిన ఇద్దరు సభ్యులతో కమిటీని వెంటనే ఏర్పాటు చేసింది. ఆ కమిటీ వెంటనే అంటే అక్టోబర్ 23న రాష్ట్రానికి వచ్చింది. 24 తేదీన మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించింది. 25న తెలంగాణ రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు, ప్రాజెక్టు అధికారులు, బరాజ్ నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై సాంకేతిక అంశాలన్నింటికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నది. బరాజ్ నిర్మాణానికి ముందు చేపట్టిన పరీక్షలు, నిర్మించిన విధానం, అందుకు వినియోగించిన యంత్ర పరికరాలకు సంబంధించిన అంశాలపై ఆరా తీసింది. తదుపరి మరో 20 సాంకేతిక అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వాలని ఆదేశించింది. ఆ పూర్తి సమాచారాన్ని రాష్ట్ర అధికారులు ఇవ్వకముందే 29వ తేదీ నాటికే కాళేశ్వరం బరాజ్ ఘటనపై ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. అదీ అప్పటి ప్రభుత్వానికి ఇవ్వకుండా నేరుగా పత్రికలకు విడుదల చేసింది. ఎలాంటి పరీక్షలు, పరిశోధనలు చేయకుండానే కేవలం క్షేత్రస్థాయి సందర్శన ద్వారానే బరాజ్ కుంగుబాటునకు డిజైన్, నాణ్యత లోపాలు కారణాలంటూ ఎన్‌డీఎస్‌ఏ నిర్ధారించడం గమనార్హం. అటు తరువాత ఎన్‌డీఎస్‌ఏ మళ్లీ స్పందించలేదు. అంతేకాదు, అంతర్జాతీయ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, ఉచిత సలహాలు ఇచ్చింది తప్ప పూర్తి స్థాయి విచారణకు మాత్రం ముందుకురాలేదు.

### మళ్లీ సరిగ్గా పార్లమెంట్ ఎన్నికల ముందు..

స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అవకాశం, అధికారం ఉన్నా, నాలుగు నెలలపాటు ఎన్‌డీఎస్‌ఏ ఏనాడూ మేడిగడ్డ ఘటనపై మళ్లీ స్పందించలేదు. మేడిగడ్డ బరాజ్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి, లోపాలను గుర్తించడంతోపాటు తదుపరి చేపట్టాల్సిన పునరుద్ధరణ చర్యలపై తగిన సిఫారసులు చేయాలని కోరుతూ కేంద్ర జల్‌శక్తి శాఖకు తెలంగాణ ప్రభుత్వం 2024 ఫిబ్రవరి 13న విజ్ఞప్తి చేసింది. అప్పుడు గాని ఎన్‌డీఎస్‌ఏ మళ్లీ స్పందించకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే తాజాగా మేడిగడ్డ బరాజ్ ఘటనకు సంబంధించి అధ్యయనానికి సీడబ్ల్యూసీ, గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్‌ఎంబీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఎన్‌డీఎస్‌ఏ ఆరుగురు సభ్యుల నిపుణుల కమిటీని 2024 మార్చిలో నియమించింది. అయితే, నాడు వారంరోజుల్లోనే నివేదిక ఇచ్చిన ఎన్‌డీఎస్‌ఏను ఈసారి మాత్రం నాలుగు నెలల్లో రిపోర్టు ఇవ్వాలని కేంద్రం ఆదేశించడం గమనార్హం. ఆ నిపుణుల కమిటీ 2024 మార్చి 6,7,8,9 తేదీల్లో, ఆ తరువాత 20,21,22 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించింది. స్వయంగా వెళ్లి మూడు బరాజ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. నిర్మాణ ఏజెన్సీలతో, అందులో భాగస్వాములైన అధికారులతోనూ భేటీ అయ్యింది. బరాజ్‌లకు సంబంధించిన నిర్మాణ డిజైన్లు, తదితర డాక్యుమెంట్లను సైతం ఇరిగేషన్ అధికారులను అడిగి తీసుకున్నది. తుదకు సరిగ్గా పార్లమెంట్ ఎన్నికల ముందు 2024 మే 7న కేవలం మధ్యంతర నివేదికను ఎన్డీఎస్‌ఏ చైర్మన్ అనిల్‌జైన్ రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు పంపించారు. ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండానే డిజైన్, నిర్మాణం, ఓఅండ్ఎం తదితర వైఫల్యాల మూలంగానే బరాజ్ పిల్లర్ కుంగిందని ఊహాజనితంగా రిపోర్టు ఇచ్చారు. దానిపై నాడు నానా హడావుడి చేశారు. 2024 డిసెంబర్ నాటికి తుది నివేదికను అందిజేస్తామని అనాడే వెల్లడించారు. కానీ, ఇప్పటివరకు బయటపెట్టలేదు.

### బీజేపీ, కాంగ్రెస్ కుట్ర రాజకీయం

మొత్తం పరిణామాలను గమనిస్తే.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్లు బీఆర్‌ఎస్‌ను బద్నాం చేయడమే లక్ష్యంగా ఆదినుంచీ పావులు కదుపుతున్నాయని స్పష్టమవుతున్నది. మేడిగడ్డ ఘటన జరిగిన నాటినుంచి ఇప్పటివరకు ఆ రెండు పార్టీలు వ్యవహరిస్తున్న తీరే అందుకు బలాన్ని చేకూర్చుతున్నది. తాజాగా ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ ఏర్పాటుతో అది మరోసారి బట్టబయలైందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో సాగునీరు అందక పంటలు ఎండిపోతుండడంతో రైతాంగం కన్నెర్ర చేస్తున్నది. పాలన పడకేయగా సబ్బండ వర్గాల్లో వ్యతిరేకత పెల్లుబికుతున్నది. దీంతో సర్కారు ఉక్కిరిబిక్కిరవుతున్నది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను ఏర్పాటు చేయడం, తెలంగాణ వ్యాప్తంగా విశేష స్పందన వస్తున్నది. గులాబీ పార్టీకి మరింత ఆదరణ పెరుగుతున్నది. దీంతో ఇప్పుడు సర్కారు తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు, బీఆర్‌ఎస్‌ను మరోసారి బద్నాం చేసేందుకు పూనుకోగా, కేంద్రం తనవంతుగా లోపాయికారీ సహకారాన్ని అందిస్తున్నది. కేంద్రం సైతం కాంగ్రెస్ సర్కారును గట్టెక్కించేందుకు ఇప్పుడు నివేదికను బయటపెట్టినట్టు తెలిసిపోతున్నది. మొత్తంగా రెండు పార్టీలు కూడబలుక్కుని కాళేశ్వరం ప్రాజెక్టును ఖతం పట్టించి, తద్వారా బీఆర్‌ఎస్‌ను, కేసీఆర్‌ను బద్నాం చేయాలని పన్నాగాలు పన్నుతున్నాయని రాజకీయ విశ్లేషకులు బలంగా వాదిస్తున్నారు. అందుకు ఇరు పార్టీలు వ్యవహరిస్తున్న తీరు బలాన్ని చేకూర్చుతున్నది.

### రెండునెలలు తొక్కిపెట్టి.. మళ్లీ రజతోత్సవ సభ ముందే..

**మేడిగడ్డ** బరాజ్ ఘటనకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదిక దాదాపు రెండు నెలల క్రితం సిద్ధమైంది. నిపుణుల కమిటీ ఈ ఏడాది జనవరి నెలాఖరునే తన తుది నివేదికను ఎన్‌డీఏఎస్ చైర్మన్‌కు అందజేయగా, ఆయన దానిని కేంద్ర జల్‌శకి శాఖకు సమర్పించారు. ఈ విషయాన్ని కేంద్ర జల్‌శక్తి శాఖ ఉన్నతాధికారులే రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులకు తెలియజేశారు. అంతేకాదు, ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ లేవనెత్తిన అంశాలను ఉటంకిస్తూ సీతారామ ప్రాజెక్టుకు సైతం తుది అనుమతులను నిరాకరించారు. డిజైన్లను పరిశీలించిన తరువాతే తుది అనుమతులను ఇస్తామని టీఏసీలో కేంద్ర జల్‌శక్తి శాఖ స్పష్టం చేసిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కానీ, దాదాపుగా రెండు నెలలుగా కేంద్ర జల్‌శక్తి శాఖ నిపుణుల కమిటీ నివేదికను తొక్కిపెట్టినట్టు తేటతెల్లమవుతున్నది. కేంద్ర జల్‌శక్తి శాఖ ఆ నివేదికను సీడబ్ల్యూసీకి పంపి పరిశీలన పేరిట కాలయాపన చేసింది. ఇటీవల కాలంలో కూడా 'నివేదిక ఎక్కడ?' అని రాష్ట్ర అధికారులు అడిగినా, కేంద్రం ఉలుకూపలుకు లేకుండా ఉండిపోయింది. కానీ, సరిగ్గా బీఆర్‌ఎస్ పార్టీ రతతోత్సవ సభకు రెండు రోజుల ముందే హఠాత్తుగా ఒక్కసారిగా నివేదికను కేంద్రం పంపడం గమనార్హం.

## తుది దశకు కాళేశ్వరం కమిషన్ నివేదిక

### మే రెండో వారంలో ప్రభుత్వానికి సమర్పించే అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం కమిషన్ నివేదిక తుది దశకు చేరుకున్నది. మరో రెండు వారాల్లో ప్రభుత్వానికి సమర్పించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు కమిషన్ వర్గాలు వెల్లడించాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణ లోపాలపై విచారణ కోసం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో కాళేశ్వరం కమిషన్‌ను ప్రభుత్వం నిరుడు ఫిబ్రవరిలో ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఈ కమిషన్ ఇప్పటికే ఇరిగేషన్‌శాఖ ఇంజినీర్లు, డిజైన్లు, డీపీఆర్, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారించింది. కాగ్ అధికారులను సైతం పలు అంశాలపై ప్రశ్నించింది. ఆయా అంశాలన్నింటినీ క్రోడీకరించి దాదాపు 400 పేజీలతో రిపోర్టును తయారు చేస్తున్నట్టు సమాచారం. ఇటీవల విజిలెన్స్ అందించిన నివేదికలను కమిషన్ అధ్యయనం చేస్తున్నది. ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) తుది నివేదిక కూడా రావాల్సి ఉన్నది. ఆ నివేదికలోని అంశాలను కూడా పొందుపర్చి రిపోర్టును సిద్ధం చేయనున్నది. కమిషన్ గడువు ఈ నెల 30న ముగియనున్న నేపథ్యంలో మరో నెల రోజులపాటు పొడిగించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు తెలిసింది.

## భూదాన్ భూముల్లో ఐఏఎస్, ఐపీఎస్‌లా!

- ఉన్నతాధికారుల పాత్రపై హైకోర్టు విస్మయం.. నోటీసులు జారీ
- కుటుంబ సభ్యుల పేర్లతో కొనుగోలు చేశారని ఆరోపణ
- ఆ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని ఉత్తర్వులు
- కేంద్ర, రాష్ట్రాలతోపాటు సీబీఐ, ఈడీలకు కూడా నోటీసులు



హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో సర్వే నం. 181, 182, 194, 195లో భూదాన్ భూములు అన్యాక్రాంతం కావడంలో పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌లు సహా కొందరు ఉన్నతాధికారుల పాత్ర ఉందన్న పిటిషన్‌ను విచారించిన హైకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై సీబీఐ, ఈడీ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టింది. ప్రాథమికంగా రికార్డులను పరిశీలిస్తే నాగారం గ్రామంలోని భూములు భూదాన్ బోర్డుకు చెందినవని పేర్కొంది. భూదాన్ భూముల అన్యాక్రాంతంలో ఉన్నతాధికారుల పాత్ర ఉందన్న ఆరోపణల నేపథ్యంలో ప్రజా ఆస్తి పరిరక్షణ చర్యల్లో భాగంగా వాటిని నిషేధిత జాబితాలో చేర్చాలని జిల్లా కలెక్టర్, మహేశ్వరం, ఎల్బీనగర్ సబ్‌రిజిస్ట్రార్లకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు వీలుగా ఏ ఒక్క లావాదేవీని జరపడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. ఈ భూబాగోతంలో ఉన్నతాధికారుల పాత్రపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పిటిషనర్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతించరాదని రిజిస్ట్రీని ఆదేశించింది. కీలక నిర్ణయాలు తీసుకొనే అధికారులపైనే తీవ్ర అభియోగాలు ఉన్నందున ఈ వ్యవహారంలో అధికార దుర్వినియోగానికి ఆస్కారం ఇవ్వబోమని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో ప్రయోజనాల పరిరక్షణ చర్యల్లో భాగంగా ఆ అధికారులకు అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా మధ్యంతర ఉత్తర్వులను జారీచేస్తున్నట్టు ప్రకటించింది. భూదాన్, గ్రామదాన చట్టం ప్రకారం దాతలు ఇచ్చిన భూదాన్ భూములను పేదలకు వ్యవసాయం, ఇండ్ల నిర్మాణాలకు కేటాయించాల్సి ఉందని గుర్తుచేసింది. ఈ భూములు వారసత్వంగా కొనసాగించవచ్చని పేర్కొంది. అన్యాక్రాంతం చేయడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి గురువారం కీలక ఉత్తర్వులు జారీచేశారు.

### నిషేధిత జాబితాలోకి భూములు

**వాదనల తర్వాత హైకోర్టు.. నాగారంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూములు భూదాన్ బోర్డుకు చెందినవని ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఉన్నతాధికారులపై తీవ్రమైన ఆరోపణలు ఉన్న నేపథ్యంలో వారి ప్రయోజనాల రక్షణల్లో అధికార దుర్వినియోగానికి అవకాశం ఉంటుందని సందేహం వ్యక్తంచేసింది. కాబట్టి తమకున్న విచక్షణాధికారాలను వినియోగించి ఈ పిటిషన్‌పై విచారణ పూర్తయ్యే వరకు సర్వే నం. 181, 182, 194, 195లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని రంగారెడ్డి జిలా కలెక్టర్, సబ్‌రిజిస్ట్రార్‌లకు ఉత్తర్వులు జారీచేస్తున్నట్టు ప్రకటించింది. తిరిగి ఉత్తర్వులు జారీ చేసేదాకా ఈ భూముల్లో ఎలాంటి మార్పులు చేర్పులు చేయరాదని షరతు విధించింది. భూదాతల అభీష్టానికి అనుగుణంగా అవి వ్యవసాయం చేసుకునేందుకు మాత్రమే వినియోగించేందుకు పేదలకు కేటాయించవచ్చని పేర్కొంది. లేనిపక్షంలో ప్రభుత్వ, స్థానిక సంస్థలు ప్రజా అవసరాలకు, బలహీనవర్గాల ఇండ్ల నిర్మాణానికి వాడుకోవచ్చునని తెలిపింది. భూదాన్ నిబంధన 3 ప్రకారం కేటాయింపులు వారసత్వంగా ఇవ్వవచ్చనని కూడా పేర్కొంది. అంతేగాని అన్యాక్రాంతం చేయడానికి వీల్లేదని స్పష్టంచేసింది. తదుపరి విచారణను జూన్ ఒకటికి వాయిదా వేసింది.**

### ఫిర్యాదులపై చర్యలు శూన్యం

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని భూదాన్ భూముల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గత ఫిబ్రవరి, మార్చిల్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదంటూ స్థానికుడు బిడ్డ మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై సీబీఐ, ఈడీలతో దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. సీనియర్ న్యాయవాది ఎల్ రవిచందర్ వాదనలు వినిపిస్తూ సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పాత్ర ఉన్నందున సీబీఐ, ఈడీ దర్యాప్తునకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. భూదాన్ చట్టం, తెలంగాణ భూదాన్, గ్రామదాన నిబంధనలు-1965కు విరుద్ధంగా సొంత పేర్లతోపాటు కుటుంబ సభ్యుల పేర్లతో కొనుగోలు చేశారని తెలిపారు. గత ఏడాది నవంబర్‌లో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు, ఈ ఏడాది మార్చి 8న సీఎంవో కార్యాలయంతో పాటు హోంశాఖ ముఖ్యకార్యదర్శికి వినతిపత్రాలు పంపినప్పటికీ చర్యలు శూన్యమని తెలిపారు. ఏపీ, తెలంగాణల్లో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పాత్ర ఉన్నందున కేంద్రానికి చెందిన డీవోపీటీ, హోంశాఖలకు జనవరి 13న ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని పేర్కొన్నారు. పోలీసులు, అధికారులు ఫోర్జరీ పత్రాలతో రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారని తెలిపారు. బినామీ లావాదేవీలు నిర్వహించడంతో చట్టవిరుద్ధంగా భూదాన్ భూములను అక్రమంగా బదలాయింపులు చేశారని ఆరోపించారు. భూదాన్ భూముల బదలాయింపు, అన్యాక్రాంతంపై నిషేధం ఉన్నప్పటికీ అధికారులు రికార్డులను తారుమారు చేశారని అన్నారు. రెవెన్యూ రికార్డుల్లో పేర్లు చేర్పించుకుని పట్టాదార్ పాస్ పుస్తకాలు కూడా పొందారని తెలిపారు. అక్రమాలను బయటపెట్టిన పిటిషనర్లకు హాని తలపెట్టే అవకాశం ఉన్నదని, రక్షణ కల్పించాలని కోరారు.

### ఐఏఎస్, ఐపీఎస్‌లకు నోటీసులు

**ప్రతివాదులైన** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, భూదాన్ యజ్ఞ బోర్డు, సీసీఎల్ఏతోపాటు సీబీఐ, ఈడీలకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వాళ్ల కుటుంబసభ్యులకు, ఇతర అధికారులకు కూడా నోటీసులు జారీచేసింది. ఐఏఎస్/ఐపీఎస్ అధికారులు నవీన్ మిట్టల్, జ్ఞానముద్ర (సోమేశ్‌కుమార్ భార్య), పావనీరావు (రిటైర్డ్ ఐపీఎస్ ప్రభాకర్‌రావు భార్య), ఐశ్వర్యరాజు (ఈ వికాస్‌రాజు భార్య), వసుంధర సిన్హా, ఏకే మొహంతి, ఓం అనిరుధ్ (ఐపీఎస్ అధికారి రాచకొండ కమిషనర్ కొడుకు), నందిన్‌మాన్ (ఐపీఎస్ విక్రమ్‌సింగ్‌మాన్ భార్య), రీటా సుల్తానియా (ఐఏఎస్ సందీప్‌సుల్తానియా భార్య), రాధిక (ఐపీఎస్ కమలాసన్‌రెడ్డి భార్య), నితేశ్‌రెడ్డి (మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి కొడుకు), ఐపీఎస్ అధికారులు మహేశ్ భగవత్, సౌమ్యా మిశ్రా, స్వాతి లక్రా, రవి గుప్తా, తరుణ్‌జోషి, తోట శ్రీనివాసరావు, సుబ్బారాయుడు, రాహుల్ హెగ్డే, రేఖా షరాఫ్ (ఐపీఎస్ ఉమేశ్‌షరాఫ్ భార్య), రేణుగోయల్ (డీజీపీ జితేందర్ భార్య), దివ్యశ్రీ (ఐఏఎస్ ఆంజనేయులు భార్య), హేమలత (ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి భార్య), ఇందూరావు కే (ఐపీఎస్ లక్ష్మీనారాయణ భార్య), సవ్యసాచి ప్రతాప్‌సింగ్ (ఐపీఎస్ గోవింద్‌సింగ్ కొడుకు), రాహుల్ (రిటైర్డ్ ఐఏఎస్ జనార్దన్‌రెడ్డి కొడుకు), వరుణ్ (ఐపీఎస్ విశ్వప్రసాద్ కొడుకు), రిటైర్డ్ డీజీపీ అనురాగ్ శర్మ, ఐఏఎస్‌లు అమోయ్‌కుమార్, రాజశ్రీ హర్ష, అజయ్‌జైన్, ఇతర అధికారులు, ప్రైవేట్ వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను వారందరికీ అందజేయాలని పిటిషనర్‌ను ఆదేశించారు.



సర్వే చేసేందుకు కోర్టు స్టే ఉన్న భూమిలోకి వచ్చిన అధికారులు, పోలీసులు

## మా భూముల జోలికొస్తే మర్యాద దక్కదు!

- సర్వే అధికారులు, పోలీసులపై మర్లవడ్డ మేడిపల్లి రైతు
- కోర్టు స్టే ఉన్న భూముల్లోకి ఎందుకొచ్చిన్నారంటూ నిలదీత
- ఫార్మా కంపెనీలకు భూములు ఇచ్చే ప్రసక్తేలేదని వెల్లడి
- ధైర్యంగా నిలదీసిన రైతు, వెనుదిరిగిన అధికారులు

యాచారం, ఏప్రిల్ 24: 'ఇది మా భూమి. మాకేమైనా మీ ప్రభుత్వమిచ్చిందా, నువ్విచ్చినవా? మాకు చెప్పకుండా మాభూముల్లోకి ఎందుకొచ్చిండ్రు? మా భూమిలో సర్వే చేయొద్దు. మర్యాదగా వెళ్లి పోండి. మంచితనంగా ఇక్కడి నుంచి వెళ్లకపోతే సర్వే మిషన్లు పగుల గొడతాను." ఇవీ రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లికి చెందిన కాస ఎట్టయ్య అధికారులకు తేల్చిచెప్పిన మాటలు. వివరాల్లోకి వెళ్తే గురువారం ఫార్మా కంపెనీల పేరుతో అధికారులు, పోలీసులు మరోసారి సర్వేకు దిగడం ఉద్రిక్తంగా మారింది. ఫార్మాకు భూములు ఇచ్చే ప్రసక్తేలేదంటూ కోర్టు స్టే తెచ్చుకున్న రైతుల భూముల్లోకి అధికారులు వెళ్లడం ఇందుకు కారణమైంది. సర్వే నంబర్ 408లోని మంజుల పేరుమీదున్న భూమిలోకి రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు, పోలీసులు సర్వే చేసేందుకు వెళ్లారు. ఫెన్సింగ్ వేసేందుకు యత్నించారు. అక్కడ హద్దు రాయి కూడా వేశారు. విషయం తెలుసుకున్న మంజుల తండ్రి ఎట్టయ్య అక్కడికి చేరుకొని సర్వేను అడ్డుకున్నాడు. హద్దు రాయిని తొలగించాడు. దమ్ముంటే సర్వే మిషన్లు పగులగొట్టు అంటూ పోలీసులు రైతుతో వాగ్వాదానికి దిగారు. దీంతో " నువ్వసలు మా భూమిలకెందుకొచ్చినవో ముందు అది చెప్పు. కోర్టు పరిధిలో ఉన్న భూమిలోకి రాబోమని చెప్పి, మళ్లీ ఎందుకొచ్చిండ్రు?" అంటూ రైతు ఎట్టయ్య మండిపడ్డాడు. దీంతో సర్వే ఏమీ చేయడంలేదని, సర్వే నంబర్ చెక్ చేసేందుకు వచ్చామంటూ అధికారులు, పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోసారి తమ భూముల్లోకి వస్తే ప్రస్తుతం చేపడుతున్న ఫెన్సింగ్ పనులను అడ్డుకుంటామని రైతు హెచ్చరించాడు.

## గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

- భవనంపైనుంచి దూకి బలవన్మరణం
- మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఘటన



లక్ష్మీప్రసన్న (ఫైల్)

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 24 : మంచిర్యాలలోని కాలేజ్ రోడ్డులో గల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో భీమిని మండలం జగ్గయ్యపేటకు చెందిన జంగంపల్లి గోపాల్-నాగమ్మ దంపతుల రెండోకూతురు లక్ష్మీప్రసన్న(19) బీకాం సెకండియర్ చదువుతున్నది. బుధవారం రాత్రి 9:30 గంటలకు తన చిన్నమ్మ కొడుకు కోలపూరి వెంకటేశ్‌కు వాచ్‌మన్ మహేశ్ ఫోన్ నుంచి మిస్డ్‌కాల్ ఇవ్వగా.. ఈ సమయంలో విద్యార్థులకు మొబైల్స్ ఎందుకు ఇస్తున్నారంటూ వెంకటేశ్ వాచ్‌మన్‌ని నిలదీశాడు. దీనిపై ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్ మల్లేశ్‌కు ఫోన్‌చేసి వాచ్‌మన్‌పై ఫిర్యాదు చేశాడు. దీంతో వాచ్‌మన్ లక్ష్మీప్రసన్నను దూషించడం తో మనస్తాపం చెంది గురువారం ఉదయం కళాశాల భవనం నాలుగో అంతస్తు ఎక్కి కిందకు దూకింది. విద్యార్థులు, అధ్యాపకులు ఆమెను మంచిర్యాల జనరల్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, సీఐ ప్రమోద్‌రావు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు, బీజేపీ నాయకులు, కుటుంబ సభ్యులు దవాఖాన ఎదుట ఆందోళనకు దిగారు. అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ చేరుకోగా.. మృతురాలి తల్లితండ్రులు ఆయన కాళ్లమీదపడ్డారు. కారకులకు శిక్షపడేలా చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కళాశాల ప్రిన్సిపాల్ అనూషను వివరణ కోరగా.. తాను లీవ్‌లో ఉన్నానని, లక్ష్మీప్రసన్న తన అన్నయ్యతో రాత్రి ఫోన్లో మాట్లాడినట్టు వాచ్‌మన్ తన దృష్టికి తీసుకువచ్చాడని వివరించారు. మృతురాలి తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏసీపీ తెలిపారు.

### లోకం పోకడ





## రాష్ట్రమంతా నిప్పల కుంపటి

### రోజురోజుకూ పెరుగుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఇటీవల అకాల వర్షాలతో కాస్త బ్రేక్ ఇచ్చినా.. తిరిగి ప్రతాపం చూపుతున్నాడు. మధ్యాహ్నం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిప్పుల కుంపటిని తలపిస్తున్నది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటిన నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. 29 జిల్లాల్లో 42 డిగ్రీలు దాటగా ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు పలు జిల్లాల్లో నేడు, రేపు వర్షాలు పడొచ్చని పేర్కొంది.

| జిల్లా | గరిష్ఠ ఉష్ణోగ్రతలు (డిగ్రీలలో) |
|---|---|
| నిజామాబాద్ | 45.3 |
| ఆదిలాబాద్ | 45.2 |
| నిర్మల్ | 45.2 |
| మంచిర్యాల | 45.2 |
| జగిత్యాల | 44.9 |
| కొమురంభీం | 44.9 |
| జోగులాంబ -గద్వాల | 44.8 |
| కామారెడ్డి | 44.8 |
| నల్లగొండ | 44.8 |
| కరీంనగర్ | 44.7 |



## వడదెబ్బతో ఐదుగురి మృతి

నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 24: రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వడదెబ్బకు గురువారం ఒక్కరోజే ఐదుగురు మృత్యువాతపడ్డారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయికి చెందిన కనక కాశీరాం(42), పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లికి చెందిన లోంకర్ ప్రభాకర్ (24), మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తొమ్మిదిగుడిసెల పల్లెకు చెందిన రాసమల్ల భూదేవి(60) వడదెబ్బతో మృతిచెందారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన సోఫీబేగ్ (25) గురువారం వడదెబ్బతో మృతి చెందారు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రానికి చెందిన చింతకుంట్ల రమేశ్ (30) ఎండ వేడిమికి అస్వస్థతకు గురై మరణించారు.

## ముగ్గురు రైతుల ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...




జిల్లా కారేపల్లి మండలం దుబ్బతండాకు చెందిన లావుడ్యా భద్రు (52) రెండెకరాల్లో మిర్చి, మరో రెండెకరాల్లో పత్తి పంట వేశాడు. సాగు చేసిన పంటను చీడపీడలు ఆశించడంతో ఆ ప్రభావం దిగుబడులపై పడింది. దీంతో పంట సాగు కోసం తెచ్చిన అప్పులు తీర్చేందుకు వ్యవసాయం చేయడంతోపాటు ఓ షాపులో గుమస్తాగా చేరాడు. అయినా అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన భద్రు తన మిర్చి తోట వద్దకు వెళ్లి బుధవారం ఉదయం గడ్డి మందు తాగాడు. తర్వాత భార్యకు ఫోన్‌చేసి.. 'నేను గడ్డి మందు తాగాను. పిల్లలు జాగ్రత్త' అని చెప్పి ఫోన్ కట్ చేశాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే చేను వద్దకు చేరుకుని భద్రును ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకొచ్చి అనంతరం వాహనంలో ఖమ్మం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ భద్రు గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై నాగరాజకుమారి తెలిపారు.

### బోర్ల కోసం 4 లక్షలు అప్పు చేసి..

యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం కొండ్రెడ్డి చెరువు గ్రామానికి చెందిన రైతు కర్రె మహేశ్(28) వ్యవసాయంతో పాటు ఆటో నడిపించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటి నిర్మాణం కోసం రూ. 10 లక్షలు, సాగునీటి కోసం వేసిన బోర్లకు రూ. 4 లక్షలు అప్పు చేశాడు. పంట దిగుబడి లేక, ఆటో నడవక చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురయ్యాడు. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

### మూడు బోర్లేసినా దక్కని ఫలితం..

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన నేనావత్ జహంగీర్ (35) తనకున్న ఎకరా పొలంలో సరిగ్గా నీరు లేకపోవడంతో అప్పు చేసి మూడు బోర్లు వేయించాడు. దీంతోపాటు వేసిన పంట సరిగ్గా పండక తీవ్ర నష్టం వాటిల్లింది. బోర్లకు, పంట పెట్టుబడికి సుమారు రూ.5 లక్షల వరకు అప్పులు అయ్యాయి. చేసిన అప్పులకు వడ్డీ పెరిగిపోవడంతో జహంగీర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈనెల 12న తన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు నర్సాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య నేనావత్ సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై లింగం తెలిపారు.